ఈత..గుండెకోత!

- ప్రమాదాలకు నిలయంగా మేహాద్రి
- ఉసురు తీస్తున్న చెరువులు, గెడ్డలు

జీవితంపై ఎన్నో ఆశలు.. కుటుంబ బరువు బాధ్యతలు..స్నేహితులతో మధురానుభూతులు..ఇలా అన్నీ నీటిలోనే సమాధి అవుతున్నాయి. సరదాకు ఈతకు వెళితే అక్కడే జీవితం ముగిసిపోతుంది. ఇటు కుటుంబ సభ్యులకు..అటు స్నేహితులకు కన్నీరే మిగులుతుంది. సరదా, అవగాహన లోపం వెరసి చాలా మంది జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. వారివారి కుటుంబాల్లో తీరని విషాదం మిగులుతుంది.

పెందుర్తి: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో ఈత సరదాతో దిగిన వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. పెందుర్తి సమీపంలోని నల్లక్వారీ మడుగు అనేక మంది ప్రాణాలు తీసుకుంది. అలాగే పెందుర్తి, పరవాడ, సబ్బవరం ప్రాంతాల్లో చెరువులు, కాలువల్లో ఏటా వేసవిలోనే ఈత సరదాతో పిల్లలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

మృత్యు గెడ్డ మేహాద్రి

నగర పరిధిలో ఉన్న ఎక్కువ నీటి మట్టం కలిగిన రిజర్వాయర్ మేహాద్రి రిజర్వాయర్. ఇక్కడకు వేసవిలో ప్రతిరోజు వందలాది మంది సందర్శనకు వస్తుంటారు. మందుబాబులు ఇక్కడ పార్టీలు చేసుకుంటారు. అయితే సరదాగా ఈతకు వచ్చిన వారికి, పూటుగా మద్యం సేవించిన వారికి రిజర్వాయర్ లోతు గురించి అంతగా ఉండడం లేదు. దీంతో ఈత కోసం గెడ్డలోకి దూకిన తర్వాత ప్రమాదాలకు గురవుతున్నారు. ఊబిలో చిక్కుకుని ప్రాణాలు విడుస్తున్నారు. ఇక్కడ ఈత నిషేధం అని హెచ్చరిక బోర్డులు ఉన్నా కూడా లెక్క చేయకుండా దిగి పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నారు.

యమ డేంజర్

పెందుర్తి ప్రాంతంలో మరో అత్యంత ప్రమాదకరమైన నీటి మడుగు నల్లక్వారీ మడుగు. పదునైన రాతి శిలలు, అడుగడుగునా ఊబి ఉన్న ఈ మడుగులో ఆరేళ్ల కిందట ఐదుగురు విద్యార్థులు ఈతకు మరణించడం పెను విషాదం. అంతకు ముందు ఐదుగురు మేకల కాపరులు సైతం ఇక్కడ ఒకేసారి ప్రాణాలు విడిచారు. ఈ మడుగులో ఇప్పటివరకూ సుమారు 60 నుంచి 80 మంది వరకూ ప్రాణాలు విడిచారు. వీటితో పాటు చెరువులు, చిన్నపాటి గెడ్డలు కూడా ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి.



రిజర్వాయర్‌లో ప్రమాదకర ఊబి ఉన్న ప్రాంతం

వేసవిలో జాగ్రత్త

గత నాలుగేళ్లుగా మేహాద్రి, నల్లక్వారీలతో పాటు గ్రామాల్లోని చెరువుల్లో ఈతకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నవారు పదుల సంఖ్యలో ఉన్నారు. వేసవిలో ఊళ్లకు సమీపంలోని చెరువులు, కాలువల్లోకి విద్యార్థులు చేపలకు వెళ్లడం పరిపాటి. అలాగే వేడి నుంచి ఉపశమనం కోసం ఈతకు వెళ్తారు.అయితే అక్కడ ఉన్న పరిస్థితులు తెలియకుండా నేరుగా నీటిలోకి దిగితే సంభవించే ప్రమాదాలు ఊహించడానికే భయంకరంగా ఉంటాయి. వేసవి కావడంతో నీటి మట్టం తగ్గి బురద(ఊబి) మిగులుతుంది. పైన కొద్దిపాటి నీరు చూసి అందులో దిగితే ప్రాణాలకు భరోసా ఉండదు. కాబట్టి పెద్దవారు తోడు లేకుండా పిల్లలు ఈతకు, చేపల వేటకు వెళ్లడాన్ని వారించడం మంచిది.



మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

నిఘా ఏదీ..

మేహాద్రిలో ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు కలిసిపోతున్నాయి. ముఖ్యంగా వేసవి సమయం ఇక్కడ ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. మేహాద్రి గేటు సమీపంలో నిషేధిత ప్రాంతం అని హెచ్చరిక బోర్డులు తప్పా వచ్చిన వారిని నియంత్రించేందుకు ఎవరూ ఉండరు. రిజర్వాయర్ సిబ్బంది వారించినా కొందరు ఆకతాయిలు వారితో వాదనలకు దిగి మరీ ఈతకు ఉపక్రమిస్తున్నారు. ప్రమాదాలు జరిగినపుడు వచ్చే ఉన్నతాధికారులు పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని మాటలు తప్పా చేతలు లేవని పలువురు విమర్శిస్తున్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

వేసవి సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి. నీటి వనరుల వైపు వెళ్లకుండా చూడాలి. మేహాద్రి రిజర్వాయర్ వద్ద ప్రత్యేకంగా మా సిబ్బందిని గస్తీ ఉంచుతున్నాం. మందుపార్టీలు చేసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణ, సీఐ పెందుర్తి

ఇథలిన్ వాయువుతోనే పండ్లు మగ్గబెట్టాలి

ఉద్యానశాఖ అధికారి రాధిక



మామిడి పండ్లు

పెందుర్తి: మామిడి పండ్లను కాల్షియం కార్బేట్ సహాయంతో మగ్గబెట్టడం మంచిది కాదని ఉద్యాన శాఖ అధికారి జి.రాధిక అన్నారు. దీని వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. పక్వానికి వచ్చిన మామిడి కాయలను ఇథలిన్ వాయువు సహాయంతో మగ్గబెడితే ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు ఉండదని స్పష్టం చేశారు.

పక్వానికి వచ్చిన మామిడి కాయలను గాలి చొరబడకుండా ఉండే గదిలో ఉంచి ఇథలిన్ వాయువు 2 పీపీహెచ్‌ను స్ప్రే చేసి 16 గంటల తర్వాత తీస్తే రుచికరమైన, ఆరోగ్యకరమైన మామిడి పండ్లు లభిస్తాయన్నారు. లేదా బకెట్ నీటిలో ఇథలిన్ ద్రావణం, క్లాసిక్ సోడా కలిపి చల్లిన తర్వాత 24 గంటలు ఉంచాలన్నారు. దీని వల్ల ఇథలిన్ వాయువు విడుదలై మామిడి కాయలు మగ్గుతాయని చెప్పారు. ఎట్టిపరిస్థితిలోనూ ప్రభుత్వం నిషేధించిన కాల్షియం కార్బేట్ వాడరాదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

పోటీలతో ప్రతిభ వెలుగులోకి



గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించడం ద్వారా వారిలో ప్రతిభను వెలికి తీయవచ్చునని గ్రంథాలయ అధికారి శిరీష అన్నారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు కార్టూన్లు గీసే పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు రకాల కార్టూన్లు గీసి ఆకట్టుకొన్నారు. విజేతలకు శిబిరం ముగింపురోజు బహుమతులు అందజేయనున్నట్టు ఆమె తెలిపారు.

పొదల మాటున ముప్పు



రేఖవానిపాలెం-రావాడ రోడ్డులో దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు

పరవాడ: మండలంలోని రావాడ రోడ్డును ముళ్ల పొదలు ఆక్రమించడంతో ప్రయాణికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. పంచాయతీలో నునపర్తి జంక్షన్-ఎన్టీఆర్ కాలనీ రోడ్డు, గొల్లగరువు, రేఖవానిపాలెం, గొల్లగుంట, నునపర్తి, నడింపల్లి పరిసర గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలతో ఆయా గ్రామాల ప్రజలు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురెదురుగా రాకపోకలు సాగించే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోతున్నారు. రోడ్లకు ఇరువైపుల పెరిగిన ముళ్ల పొదలు తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు.


ఉల్లాసంగా.. ఉత్సాహంగా



వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆదివారం పలు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు అందించారు. అనంతరం స్పోర్ట్స్ మాస్టర్ వెంకయ్య డ్రిల్ చేయించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయ్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆడారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



ప్రసంగిస్తున్న కమలానంద భారతి స్వామి

సీతంపేట: సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న గుణ హీనత, కుసంస్కారంతో హిందూ సమాజం కుచించుకుపోయి సంకుచితమవుతోందని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అన్నారు. స్థానిక శంకరమఠంలో ‘దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమ నిర్వహణ’ అనే అంశంపై ఆదివారం ఆయన ప్రసంగించారు. దేవాలయంలో దేవుడి ఎదుట కూర్చుని ఈ విషయాలపై చర్చించాలన్నారు. ప్రతి దేవాలయంలో హిందూ ధర్మ జాగరణ, హిందూ ధర్మ ప్రచారం, హిందూ ధర్మ రక్షణ జరగాలని, దీనికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలోని స్థితిగతులు, జీవన విధానం ఆలోచనలు, పద్ధతుల్లో వచ్చిన మార్పులు, వాటి పర్యావసానం, వాటి నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సభికులు అడిగిన ప్రశ్నలకు కమలానంద భారతి స్వామి సమాధానాలిచ్చి సందేహ నివృత్తి చేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

– శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సండే సందడి

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. సెలవు దినాలు కావడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు తీర ప్రాంతాలకు చేరి ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. రెండు రోజులుగా వాతావరణం చల్లగా ఉండడంతో పట్టణ ప్రాంతాలతో సహా వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి వాహనాలపై ఆదివారం ఉదయం తీర ప్రాంతాలకు చేరారు. అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకొని ఇసుక తెన్నులపై ఆట పాటలతో సరదాగా గడిపారు. మధ్యాహ్నం విందు ఆరగించి సాయంత్రం తీరంలో జలకాలాటలతో ఎంజాయ్ చేశారు. అయితే మరిన్ని సదుపాయాలు కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.



తిక్కవానిపాలెం తీరంలో జలకాలాడుతున్న పర్యాటకులు

అలరించిన సినీ గీతాలాపన పోటీ

మల్కాపురం: స్థానిక వేదిక వద్ద ఆదివారం పిల్లనగ్రోవి పిలుపు పేరిట నిర్వహించిన సినీ సంగీత పాటల పోటీ అలరించింది. తెలుగు, హిందీ చిత్రాల్లోని పలు పాటలను కళాకారులు పాడి ఆహుతులను అలరించారు. గాయకులు ఉరుకూటి బాబూరావు యాదవ్, నూనెల పైడిరాజు యాదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి, అరకు, పాడేరు, గాజువాక, మల్కాపురం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గాయకులు పాల్గొని వారు ఎంచుకున్న పాటలను పాడి ప్రేక్షకులను అలరించారు. ఒక్కో గాయకుడికి మూడు పాటల చొప్పున పోటీ జరిగింది. అనంతరం జంటగా పాటల పోటీ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

పోటీలో పాల్గొన్న గాయనీ, గాయకులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందించారు.

మత సామరస్యంతోనే దేశాభివృద్ధి

సీతంపేట: ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రెలీజియస్ ఫ్రీడం (ఐఏఆర్ఎఫ్) సంస్థ 125వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం బుల్లయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ కేకు కట్‌చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యం ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని, మత సామరస్యానికి ఐఏఆర్ఎఫ్ చేసిన కృషిని వివరించారు. మనిషికి ఉండే స్వేచ్ఛపై అభివృద్ధి ఆధారపడి ఉంటుందని, మత సామరస్యానికి స్వేచ్ఛ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్.కె.మిషన్ కార్యదర్శి స్వాసం నేద్యానంద స్వామి, ప్రభుత్వ ఖ్వాజీ సయ్యద్ సముసిద్దీన్, రత్నకుమార్, బి.కె.రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

గణేష్‌కాలనీలో రెండిళ్లలో చోరీ

భయపడుతున్న నివాసితులు

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు గణేష్ కాలనీలో తాళాలు వేసి ఉన్న రెండిళ్లలో దొంగలు పడ్డారు. ఆదర్శ కాలనీగా పేరుగాంచిన కాలనీలో ఒకేరోజు చోరీ జరగడంతో కాలనీ వాసులు భయపడుతున్నారు. వివరాలు... గణేష్‌కాలనీలోని రోడ్డు నెంబర్-1లో చెరుకూరి వెంకట సుబ్బారావు, శ్రీలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 13న అమెరికాలో ఉంటున్న కుమారుడు దగ్గరకు వెళ్లారు. ఇంటి తాళం పక్కింటివాళ్లకు ఇచ్చారు.

అలాగే నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.అప్పలనాయుడు భార్య భారతితో కలిసి సొంతింట్లో నివాసం ఉంటున్నారు. వీరు గడిచిన గురువారం ఇంటికి తాళం వేసి తిరుపతి వెళ్లారు. కాగా ఆదివారం తెల్లవారు జామున రెండు ఇళ్ల ప్రధాన తలుపు గడియలు విరగ్గొట్టి దొంగలు లోపలికి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌ల్లో ఉన్న బీరువాలు తెరిచారు. బీరువాలోని బట్టలు, వస్తువులను చెల్లా చెదురు చేశారు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో అటుగా వచ్చిన వాచ్‌మెన్ ఇళ్లలో లైట్లు వేసి తలుపులు తెరచి ఉండడంతో చుట్టుపక్కల వాళ్లకు విషయాన్ని తెలిపాడు. దీంతో వారంతా పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులు అమెరికాలో ఉన్న వెంకట సుబ్బారావుతో పాటు తిరుపతి వెళ్లిన అప్పలనాయుడుకు ఫోన్‌లో విషయాన్ని చెప్పారు. రంగంలోకి దిగిన క్రైం పోలీసులు, క్లూస్ టీమ్ పరిశీలన జరిపారు. అయితే తమ ఇంట్లో ఎలాంటి బంగారు, వెండి వస్తువులు ఉంచలేదని అమెరికా వెళ్లిన వెంకట సుబ్బారావు ఫోన్‌లో తెలియజేశారు. అలాగే చిన్న వస్తువులు తప్పా విలువైన వస్తువులు లేవని అప్పలనాయిడు కూడా చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకట సుబ్బారావు ఇంట్లో చెల్లాచెదురుగా పడేసిన బీరువాలోని దుస్తులు, వస్తువులు



విరగ్గొట్టిన అప్పలనాయుడు ఇంటి ప్రధాన ద్వారం గడియ



అప్పలనాయుడు బెడ్‌రూమ్‌లో చెల్లాచెదురుగా బీరువాలోని వస్తువులు, దుస్తులు

అప్రమత్తం చేసినా..

కాగా తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో రోడ్డు నెంబర్-1లో దొంగలు తిరుగుతున్నట్టు అనుమానంగా ఉందని గస్తీ కాస్తున్న వాచ్‌మెన్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు చుట్టు పక్కలవాళ్లను అప్రమత్తం చేశారు. మళ్లీ తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో వాచ్‌మెన్ వచ్చి చూసేసరికి రెండు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి.

18 వాహనాల సీజ్



మంత్రిపాలెంలో సీజ్ చేసిన వాహనాలు

పరవాడ: మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా పార్క్ చేసిన 18 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశామని చెసినట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు. వాహన రికార్డులపై ఆరా తీస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ సిరపరపు సురేష్, ఏఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరే రామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

యారాడ బీచ్‌ను శుభ్రపరిచిన యువత, విద్యార్థులు

మల్కాపురం: యారాడ హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం యారాడ బీచ్ తీరంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జీపీ, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు, యువత తీరంలోని వ్యర్థాలను తొలగించి పారిశుధ్య వ్యర్థాలను తరలించే వ్యాన్‌కు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ దాలిబాబు మాట్లాడుతూ బీచ్‌ను శుభ్రం చేసిన విద్యార్థులు, యువతను అభినందించి, సర్టిఫికెట్లు అందించారు. యారాడ హెల్పింగ్ యూత్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



యారాడ బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న యువత, విద్యార్థులతో సీఐ దాలిబాబు

జిల్లా కేంద్ర గ్రంథాలయం సందర్శన

డాబాగార్డెన్స్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆదివారం విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను పరిశీలించి విద్యార్థులు, బాలలతో మాట్లాడారు. వేసవి విజ్ఞాన శిబిరం ఎలా జరుగుతుంది.. సిబ్బంది పనితీరు.. సమ్మర్ క్యాంపు ఏ విధంగా ఉపయోగపడుతుందో అడిగి తెలుసుకున్నారు. కథల పుస్తకాలు చదివి సారాంశం వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పి.వి.నూకరాజు, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఇన్‌చార్జి ఎల్.ఆర్.వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత గాత్ర కచేరీ

సీతంపేట: శంకరమఠంలో ఆదివారం సాయంత్రం సంగీత సుధానిధి ఇవటూరి విజయేశ్వరరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గాత్ర సంగీత కచేరీ సభికులను ఆకట్టుకుంది. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత మండా సుధారాణి తన మృదు మధురమైన గాత్రంతో గీతాలు ఆలపించి అలరించారు. ఈమెకు ఎం.ఎస్.ఎన్.మూర్తి వయోలిన్‌పై, వంకాయల వెంకటరమణమూర్తి మృదంగంపై, వెంకటేష్ మోర్సింగ్‌పై వాద్య సహకారం అందించారు.